పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కార్తీక మాసం సందర్భంగా పంచారామాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోందని జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. జిల్లా భక్తులు సౌకర్యార్థం సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రత్యేకంగా నడుపుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 3, 10 తేదీల్లో ఆదివారం సాయంత్రం డిపో నుండి నాలుగు గంటలకు బయలుదేరి పంచారామాలను దర్శనం అనంతరం మంగళవారం వేకువ జామున విజయనగరం చేరుకుంటాయని తెలిపారు. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టిందని తెలిపారు. విజయనగరం డిపో నుండి ఆంధ్ర, సింహాచలం, జామి మీదగా ఎస్.కోట, చీపురుపల్లి, మెరకముడిదాం రూట్లో ప్రయాణించే వారు ప్రయాణం అనంతరం తమ టిక్కెట్లు వెనుకన వారి ఫోన్ నెంబర్ రాసి బస్సులో ఉన్న గిఫ్ట్ బాక్స్ లో వేస్తే ప్రతినెలా 3, 17వ తేదీల్లో డ్రా తీసి బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9959225620, 9 4 9 4 331213 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రిజిస్ట్రేషన్లు జరిగిన డి-పట్టా భూములపై

పిఒటి కేసులకు రంగం సిద్ధం

- రికార్డులు సరిగా లేక గతంలో రిజిస్ట్రేషన్లు
- విఆర్‌ఒలతో ఇసిలు తీయిస్తున్న తహశీల్దార్లు

ప్రజాశక్తి భోగాపురం

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన డి-పట్టా భూములు అమ్మినా, వాటిని కొనుగోలు చేసినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరం. కాని అప్పట్లో చాలా మంది పెద్దలు పేదల నుంచి ఈ భూములను కొనుగోలు చేశారు. కొంతమంది గ్రామ పురోణీలు ద్వారా మరికొంత మంది ఏకంగా రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేశారు. అయితే ఇప్పుడు రిజిస్రేషన్లు జరిగిన భూములపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పిఒటి (పట్టా బదలాయింపు నిషేధం) కేసులు నమోదు చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. కేసులు నమోదు చేసిన తరువాత అవసరమైతే ఇతర అవసరాల కోసం వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. ఇటీవల ప్రభుత్వం డి-పట్టా భూములను జిరాయితీగా మార్చేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. అంతేకాక రెవెన్యూ రికార్డులు ప్రకారం డి-పట్టా ఇచ్చినట్లు ఎందులో నమోదైనా సరే వాటిని జిరాయితీగా మార్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా భోగాపురం మండలంలో సుమారు 4వేల ఎకరాలు డి-పట్టా భూములను పేదలకు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో సుమారు 500 ఎకరాలు వరకు రిజిస్రేషన్లు జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. ఇలా చూసుకుంటే జిల్లా వ్యాప్తంగా అనేక ఎకరాలు రిజిస్ట్రేషన్లు జరిగి ఉంటాయని అనుకుంటున్నారు. అప్పట్లో ఎవరిపేరు మీద ఈ భూములు ఇచ్చారో ప్రస్తుతం ఆభూమి మీద ఆ కుటుంబ సభ్యులు ఉన్నారనే వారిపేరు మీద జిరాయితీగా మార్చనున్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రికార్డులు సరిగా లేక గతంలో రిజిస్ట్రేషన్లు

డి-పట్టా భూములకు సంబంధించిన రికార్డులు అప్పట్లో 2012కు ముందు సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో లేక డి-పట్టా భూములు, ల్యాండ్ సీలింగ్ భూములు దర్జాగా రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. అప్పట్లో చాలామంది పేదల వద్ద ఏకంగా ఈ భూములను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన వారే ఆ భూములుపై ఉన్నారు. కాని ఇలాంటి రిజిస్ట్రేషన్లు జరిగిన భూములను గుర్తించి పిఒటి కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. దీనికి సంబంధించి ఆయా తహశీల్దారు కార్యాలయాల్లో సమావేశాలను తహశీల్దార్లు నిర్వహిస్తున్నారు. డి-పట్టా భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు సేకరించి విఆర్‌ఒలు ఇసిలు తీస్తున్నారు. ఇందులో ఇసి వచ్చిన సర్వే నెంబర్లును పిఒటి కేసులు కింద నమోదు చేస్తున్నారు.

డి.పట్టా భూములు

రిజిస్ట్రేషన్లు జరిగితే పిఒటి కేసులు నమోదు చేస్తాం

రిజిస్ట్రేషన్లు జరిగిన డి-పట్టా భూములను విఆర్‌ఒల ద్వారా గుర్తిస్తున్నాం. సంబంధిత సర్వే నెంబర్లకు ఇసిలు తీయిస్తున్నాం. రిజిస్ట్రేషను జరిగినట్లు ఇసి వస్తే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి పిఒటి కేసులు నమోదు చేస్తాం.

చింతాడ బంగార్రాజు, తహశీల్దార్, భోగాపురం మండలం

బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాధాన్యత

సాధికార బస్సుయాత్రలో మంత్రులు రాజన్నదొర, ధర్మాన, అప్పలరాజు, గుడివాడ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వైసిపి పాలనలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాధాన్యత ఇచ్చామని ఉప ముఖ్యంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. మంగళ వారం సామాజిక సాధికార బస్సుయాత్ర సభ మంగళవారం మొయిద జంక్షన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాజన్న దొర మాట్లాడుతూ గతంలో టిడిపి హయాంలో వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యత ఇవ్వలేదని, జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక వీరందరికీ గుర్తింపు తీసుకువచ్చి తన పక్కన చోటు కల్పించారని అన్నారు.

మత్స్యశాఖా మంత్రి సీదిరి అప్పల రాజు మాట్లాడుతూ లోకేష్ భయం గురించి మాట్లాడే ముందు తన మామ బాలకృష్ణ గురించి తెలుసుకోవాలన్నారు. తన ఇంట్లో కాల్పుల ఘటనలో బాలకృష్ణ ఆసుపత్రిలో చేరి భయపడి మతిస్థిమితం లేదని సర్టిఫికెట్ తీసుకోవడం, మీ నాన్న చంద్రబాబు ఓటుకి నోటు కేసుకు భయపడి రాత్రికి రాత్రి హైదరాబాదు నుంచి విజయవాడ వచ్చేసిన సంగతి తెలుసుకోవాలన్నారు. కాగా మత్స్య కారులకు సీఎం జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక న్యాయం జరిగిందని అన్నారు. పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యతనిచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగా సారిపల్లి పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. జనసేన నాయకులు పవన్ కళ్యాణ్‌కు అవగాహన లేకుండా రుషికొండపై ఆరోపణలు చేస్తున్నారని, అక్కడ జరుగుతున్నా నిర్మాణాలు ప్రభుత్వ పరంగా జరుగుతున్నాయన్న విషయం తెలుసుకోవాలన్నారు. రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాద రావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. బ్రిటీష్ కాలం నాటి భూమి చట్టాలను మార్పు చేసి రీసర్వే జరిపించి భూముల పంపిణీ చేయడం జరిగిందని, డి-పట్టా భూములకు హక్కులు కల్పించిన ఘనత జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పల నాయుడు, బొత్స అప్పలనరసయ్య, కంబాల జోగులు, అలజంగి జోగారావు, శంబంగి వెంకట చిన అప్పల నాయుడు, ఎమ్మెల్సీలు డాక్టర్ పి.సురేష్ బాబు, పాలవలస విక్రాంత్ పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు

సచివాలయాన్ని పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

వాహనాల దారి మళ్లింపుతో తీవ్ర ఇక్కట్లు

మొయిద జంక్షన్‌లో నిర్వహించిన సభతో విజయనగరం-పాలకొండ రహదారి గుండా వెళ్లే వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

- రూ.179 కోట్ల వ్యయంతో వేణుగోపాలపురం వద్ద నిర్మాణం
- అభివృద్ధికి దోహదం : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం మండలం వేణుగోపాలపురం వద్ద సుమారు రూ.179 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన 220/132/33 కిలోవాట్ల విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి శంకుస్థాపన చేశారు. సిఎం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక ఒంటితాడి అగ్రహారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సబ్ స్టేషన్ నిర్మాణం ద్వారా వివిధ రకాల విద్యుత్ సమస్యలు పరిష్కరించబడతాయి. రైతులకు, పారిశ్రామిక, వాణిజ్య, గృహ అవసరాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా జరుగుతుంది. ముఖ్యంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఈ సబ్ స్టేషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ సబ్‌స్టేషన్ వల్ల విజయనగరం, గజపతినగరం, బొండపల్లి, నెల్లిమర్ల, గుర్ల, గరివిడి మండలాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేయడమే కాకుండా, లో వోల్టేజీ సమస్య పరిష్కరించబడుతుంది. దీనిద్వారా గరివిడి ఉప కేంద్రానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే కాకుండా, పెందుర్తి ఉపకేంద్రాలకు ప్రత్యామ్నాయంగా మారుతుంది.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి

అభివృద్ధికి దోహదం : కోలగట్ల

ఈ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే వ్యవసాయానికి పగటిపూటే 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దష్టిలో పెట్టుకొని వేణుగోపాలపురం వద్ద నిర్మించ దలపెట్టిన 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ జిల్లా అభివృద్ధికి మేలుమలుపుగా పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎల్ఎన్ రాజు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కెవి సూర్యనారాయణరాజు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఎపి ట్రాన్స్‌కో ఎస్ఇ బి.కోటేశ్వరావు, పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, విద్యుత్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ కట్టమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని అన్నారు. ఏ వృత్తిలో రాణించడానికి అయినా అంకిత భావం, కృషి, పట్టుదల అవసరమని పేర్కొన్నారు. అనంతరం కట్టమణిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ అనిలా సునందిని, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' షెడ్యూలు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా అధికారులతో మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం ప్రజావినతుల కార్యక్రమం నిర్వహణకు సంబంధించి డిసెంబరు నెలకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విడుదల చేశారు. డిసెంబరు 6న రేగిడి ఆమదాలవలస, 13న సంతకవిటి, 20న గరివిడి, 27న జామి మండలాల్లో జరిగే వినతుల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి వినతుల స్వీకరణ చేపడతారు. జిల్లా అధికారులంతా తమశాఖల మండల అధికారులతోపాటు తమకు ఆ మండలం నుంచి అందిన వినతుల పరిష్కార నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు

బొబ్బిలి : స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం బొబ్బిలి డివిజన్ ఆర్ఎంపి సభ్యులకు తిరుమల మెడికవర్ వైద్యులు ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో పిజీషియన్ డాక్టర్ రెడ్డి సుధీర్ నాయుడు మాట్లాడుతూ బ్రెయిన్‌లో రక్తస్రావం గాని, రక్తం గడ్డ కట్టడం, పక్షవాతం కేసుల్లో లక్షణాలు కనబడిన నాలుగు గంటల్లో గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. దీనినే గోల్డెన్ అవర్ అని కూడా అంటారన్నారు. డాక్టర్ విజయ్ పల్మనాలజీ, డాక్టర్ రెడ్డి శివకుమార్ నెఫ్రాలజిస్ట్, పల్లం రాజేష్ కుమార్ పలువ్యాధులపై అవగాహన కల్పించారు. తిరుమల మెడి కవర్ సర్జికల్ డిపార్ట్మెంట్ డాక్టర్ జి రామారావు, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు జంగం జోషీ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షుల ప్రభావతి

హింసకు వ్యతిరేకంగా

పూలే స్ఫూర్తితో పోరాడుదాం

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హింస వ్యతిరేక పక్షోత్సవాల సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ నుంచి ప్రజాసంఘాల కార్యాలయం వరకు మహిళలు ర్యాలీ నిర్వహించారు. మహిళలపై జరిగే దాడులను, నేరాలను అరికట్టాలని, అందుకోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, హక్కులు కాపాడాలని, మహిళా రక్షణచట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, మహిళా రిజర్వేషన్ బిల్లును వచ్చే ఏడాది నుంచే అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎన్‌పిఆర్ భవనంలో జరిగిన సదస్సులో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడారు. మహిళలపై నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు. మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకాలు పెరగడంతో నేరాలు కూడా పెరిగిపోతున్నా యని తెలిపారు. నేరాలకు కారణాలైన మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, చిన్నారులపై నేరాలు పెరగడమే కాకుండా ప్రజాస్వామ్య హక్కులపై దాడి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ సంస్కరణలు వేగవంతంగా చేసి ఇంటి పన్నులు, చెత్త పన్నులు, ఆస్తి పన్నులు పెంచుతున్నారని, మహిళలపై మరింత ఆర్థిక పరమైన వత్తిళ్లు పెరుగుతున్నాయని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు పక్షోత్సవాల్లో భాగంగా సదస్సులు, సెమినార్లు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, పట్టణ సహాయకార్యదర్శి జి.పుణ్యవతి. టి.కృష్ణమ్మ, కె.కుమారి, సిహెచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

ప్రజాశక్తి-విజయనగరం

బడుగు వర్గాల ఆశా జ్యోతి, సమాజాభివృద్ధికి ఆద్యుడు అయిన జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపునిచ్చారు. మంగళవారం జ్యోతిబా పూలే 133వ వర్ధంతిని కలెక్టరేట్ వద్ద ఘనంగా నిర్వహించారు. జ్యోతిబా పూలే, వారి సతీమణి సావిత్రీ బాయి పూలే విగ్రహాలకు ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, కలెక్టర్ నాగలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే మహిళా విద్యాభివృద్ధికి కృషి చేస్తూ సామజిక మార్పుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వారి ఆశయాలకు , ఆలోచనలకూ ప్రతిరూపంగా ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు కనపడుతున్నాయని పేర్కొన్నారు. జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల వారంతా అభివృద్ధి చెందాలని పూలే ఆనాడే భావించారని, వారి ఆశయాల మేరకు నేడు క్షేత్ర స్థాయిలో బిసిలను అభివృద్ధి చేయడానికి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి పాటు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మహిళల, దళితుల, అట్టడుగు వర్గాల వారి స్థితి గతులను మార్చాలని భావించిన పూలే భార్యా భర్తలు కలసి చదువుకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చారని అన్నారు. తొలుత తన కుటుంబ సభ్యులకే చదువు చెప్పి తదుపరి ఒక పాఠశాలను ఏర్పాటు చేసి మహిళలకు విద్యనూ బోధించారని, తద్వారా మహిళా సాధికారతకు ఆనాడే తొలి అడుగు వేసారని తెలిపారు. సమాజం లో ఎంతో మార్పు జరిగినప్పటికీ ఇంకను ఎంతో సాధించవలసి ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని తెలిపారు. నగర మేయర్ వి. విజయలక్ష్మి, జిల్లా బి.సి. సంక్షేమ అధికారి కిడారి సందీప్, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీ రావు, ఉత్తరాంధ్ర బిసి సంఘ నాయకులు ముద్దాడ మధు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పలు బీసి సంఘాల నాయకులూ, ప్రతినిధులు పాల్గొన్నారు.



పూలే విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న కోలగట్ల, కలెక్టర్, జెడ్‌పి చైర్మన్

సామాజిక దార్శనికుడు పూలే

విజయనగరం టౌన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ వద్ద పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆదాడ మోహన్ రావు, రాజేష్ , ఎమ్ .పవన్ కుమార్, గొల్లపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పి.శేఖర్

గురజాడ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం

'టాటా బిల్డింగ్ ఇండియా' వారు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గురజాడ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జూనియర్స్ విభాగంలో ఆరోతరగతి విద్యార్థి ఎస్. ఆశా భవాని గోల్డ్ మెడల్, 8వ తరగతి విద్యార్థి ఎ.యశ్వంత్ సిల్వర్ మెడల్, 9వ తరగతి విద్యార్థి ఒ.డింపుల్ వైష్ణవి బ్రాంజ్ మెడల్, సీనియర్ విభాగంలో టెన్త్ విద్యార్థిని కె.ఓమ్ని గోల్డ్ మెడల్, జి. దేవిక సిల్వర్ మెడల్, పి.సంజన బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.శేఖర్ అభినందించారు.

పురందేశ్వరిని కలిసిన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పర్యటనకు వచ్చిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరిని జనసేన నాయకులు గురాన అయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. జగన్ సర్కార్ తీరును ఎండగడుతున్న పురంధేశ్వరికి అభినందనలు తెలిపారు.

10 లీటర్ల లోపు మద్యం కేసులు తొలగింపు

ఎస్‌ఇబి అదనపు ఎస్‌పి వెంకటరావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో సెబ్,పోలీసులకు 10లీటర్ల లోపు మద్యంతో మొదటిసారి పట్టుబడిన నిందితులపై కేసులను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లుగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ఎస్. వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఎస్‌ఇబి కమిషనర్ ఎం.రవి ప్రకాష్ ఉత్తర్వులను జారీ చేసారన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2020 మే 16 నుంచి ఈ ఏడాది ఆగస్టు 29 మధ్య కాలంలో నమోదు చేసి, మొదటిసారి నేరంకు పాల్పడిన వ్యక్తులకు మాత్రమే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. ఈ తరహా కేసుల్లో ఇప్పటికే 693 కేసులను తొలగించినట్లు తెలిపారు. ఇంకా 1047 కేసులు దర్యాప్తు దశలోను, కోర్టు విచారణలో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. గుర్తించిన కేసుల్లో నిందితులకు ఇప్పటికే నోటీసులు జారీచేసి, నిర్ధేశించిన కాంపౌండింగు ఫీజు చెల్లించినట్లయితే, వారిపై దర్యాప్తులో ఉన్న లేదా కోర్టు విచారణలో ఉన్న కేసులను తొలగిస్తామన్నారు. 10 లీటర్ల లోపు ఐఎంఎఫ్ఎల్‌తో మొదటిసారి పట్టుబడితినే వారిపై నమోదైన కేసులను తొలగిస్తామన్నారు. ఈ తరహా కేసుల్లో డ్యూటీ పెయిడ్ లిక్కరు కేసుల్లో పట్టుబడిన మద్యం విలువకు మూడు రెట్లు, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కరు కేసుల్లో పట్టుబడిన మద్యం విలువకు ఐదు రెట్లు నగదు కాంపౌండింగ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత కలిగిన నిందితులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సంబంధిత పోలీసులు లేదా సెబ్ వారిని సంప్రదించి, కసులను తొలగించుకొనేందుకు చొరవ చూపాలని కోరారు. జిల్లాలో నాటుసారా, మద్యం అక్రమ రవాణ, గంజాయి నియంత్రణకు ఎస్‌ఇబి సమర్థవంతంగా పని చేస్తున్నదని తెలిపారు. డ్రగ్స్ వినియోగం కలిగే అనర్థాలను ప్రజలకు, విద్యార్థులకు వివరించి, అవగాహన కల్పించేందుకు కళాశాలలు, ముఖ్య కూడళ్ళలో కార్యక్రమాలను చేపడుతున్నా మన్నారు. నాటుసారా, గంజాయి, మద్యం, డ్రగ్స్ నియంత్రణకు సమాచారం టోల్ ఫ్రీ నంబరు 14500 అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. సమావేశంలో విజయనగరం ఎస్‌ఇబి 1వ పట్టణ సిఐ బి.మధు కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఇబి అదనపు ఎస్‌పి వెంకటరావు

సిబ్బందితోనే వైద్య సేవలు

●ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌కు హాజరుకాని బూరాడ డాక్టర్ ● సిబ్బందితో వైద్య సేవలపై గ్రామస్తులు ఆగ్రహం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని మునకలవలస పంచాయతీ పరిధి బాలకావి వలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి వైద్యాధికారి చలమయ్య గైర్హాజర్‌తో దిగువ స్థాయి సిబ్బందితోనే వైద్య సేవలు అందించడం పట్ల గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఈ గ్రామంలో 980 మంది జనాభా ఉన్నారు. బూరాడ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే 11 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. నెలలో 4వ మంగళవారం ఈ గ్రామానికి 104 ఆరోగ్య సేవలు అందవలసి ఉంది. బూరాడ పీహెచ్‌సి వైద్యులు వైద్య సేవలు అందించవలసి ఉన్నప్పటికీ ఆయన గైర్హాజర్‌తో పారంపేటకు చెందిన ఎంపిహెచ్‌ఒ సౌజన్య, ఏఎన్‌ఎం పుణ్యవతి, హెల్త్ అసిస్టెంట్ హరి, 104 డిఇఒ సత్యనారాయణ మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారని గ్రామస్తులు డోల చిన్నంనాయుడు, సరోజనమ్మ, సావిత్రి, తదితరులు తెలిపారు. కిలారి వెంకట నాయుడు, అప్పమ్మ బెడ్ రెడిట్‌లో ఉండడంతో వారిని వైద్యాధికారి దగ్గరుండి చూడాల్సిన పరిస్థితి ఉంది. డాక్టరు

రోగిని తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

గైర్హాజర్‌తో పూర్తిస్థాయి వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. డాక్టర్ రాకుంటే దిగువ స్థాయి సిబ్బందితో వైద్యం చేసుకుంటే ఇబ్బందులు పడతామని కొంతమంది రోగులు వెళ్లడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు ప్రజాశక్తి ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1.24 గంటల వరకు గ్రామంలో ఉండి వైద్య సేవలపై ఆరా తీసింది. అప్పటికి పూర్తిస్థాయిలో వైద్యులు రాకపోవడంతో జ్వరాలు, అతిసార సోకిన రోగులు రాజాం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళి చేతి చమురు వదిలించుకోవలసిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు. బూరాడ వైద్యాధికారి చలమయ్య పనితీరుపై గ్రామస్తులు మండి పడుతున్నారు. అక్కడ దిగువ స్థాయి వైద్య సిబ్బందిని డాక్టర్ వచ్చారా.. రాలేదా.. అని ఆరా తీస్తే ఏమి చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. వాస్తవంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా ఇంటింటి కార్యక్రమం నిర్వహించి వైద్య శిబిరానికి రోగులను తీసుకురావాల్సి ఉంది. సిబ్బంది ఇంటింటికి తిరిగి రోగులను శిబిరం వరకూ తీసుకొచ్చినా డాక్టర్ రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సిబ్బందే కొంత మందికి తెలిసీ తెలియని మందులు ఇచ్చి కార్యక్రమాన్ని మమా అని పించారు. వైద్యులు రాకపోవడంతో 980 జనాభాకు కేవలం 53 మందే వైద్య సేవలు వినియోగించు కున్నారు. ఇప్పటికైనా వైద్యులు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించకుంటే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని కొంతమంది గ్రామస్తులు ముందుకు వచ్చారు. వైద్య సేవలందించడానికి హాజరు కాని పిహెచ్‌సి వైద్యులు చలమయ్యపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమ్మె జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు అంగన్‌వాడీలకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ డిసెంబరు 8 నుండి నిరవధిక సమ్మె చేస్తున్నారని ఈ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యుఎస్ రవి కుమార్, విజయనగరం నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలో జరుగుతున్న సెక్టార్ మీటింగ్స్‌లో భాగంగా కొండవెలగాడ, నెల్లిమర్ల, సారిపల్లి, సతివాడల్లో వెళ్లి అంగన్ వాడీలకు పోరాట కార్యాక్రమాన్ని తెలిపారు. అంగన్వాడీ టీచర్, హెల్పర్‌లను పర్మినెంట్ చేయాలని, పింఛన్లు ఇవ్వాలనీ, తెలంగాణ రాష్ట్రం కన్న వెయ్యి రూపాయల వరకూ ఎక్కువ జీతం ఇస్తామన్న జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిల బెట్టు కొవాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

నెల్లిమర్ల: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

నాయకులు పార్వతి, మంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: డిసెంబర్ 8 నుండి కనీస వేతనాలు రూ.26 వేలు ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వం కన్నా ఇచ్చిన హామీ ప్రకారం అదనపు జీతం ఇవ్వాలని, గ్రాడ్యుటి పెన్షన్, ఎక్స్‌గ్రేషియా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి కోరారు. బొండపల్లి మండల కేంద్రం వద్ద అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. డిసెంబర్ ఒకటి నుంచి ఐదో తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసనగా సెంటర్‌కు హాజరై డ్యూటీలు చేస్తామన్నారు. డిసెంబర్ 6న అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతులు సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమారి, హైమ, శాంతి పాల్గొన్నారు.

దత్తిరాజేరు: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని కోరుతూ డిసెంబర్ 8వ తేదీ నుండి అంగన్వాడీల నిరవధిక సమ్మెకు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు వి.లక్ష్మి కోరారు. మండలంలోని పెదమానాపురం బీసీ కాలనీలో మంగళవారం పలువురు అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పి జ్యోతి, సెక్టార్ లీడర్లు కే వాణి, జి ముత్యాలమ్మ, ఆర్ రేణుక, భారతి, పలువురు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు పలువురు ఎంపిక

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని దేవుదల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 8వ తరగతి విద్యార్థిని వై.యశోద అండర్ 17 కబడ్డీ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ నెల 26న చిత్తూరు జిల్లా చోడిపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు తెలిపారు. 2024 జనవరిలో ఒడిస్సా రాష్ట్రం జైపూర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఆడనునట్లు తెలిపారు. యశోద ఎంపిక పట్ల ఎంఇఒలు వరప్రసాదరావు, యరకయ్య, పిఇటి అమ్మాజీ, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని శ్రీ సూర్యోదయ జూనియర్ కళాశాల విద్యార్థి కర్రోతు యశ్వంత్‌కుమార్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన అండర్ -17 అంతరజిల్లా కబడ్డీ పోటీలలో విజయనగరం జిల్లా ప్రథమస్థానం లబించిన విషయం తెలిసిందే. ఆ టీమ్‌లో వైస్ కెప్టెన్‌గా యశ్వంత్‌కుమార్ మంచి ప్రతిభ కనబరిచాడు. దాంతో ఆ విధ్యార్థిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేశారు. కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికవడంతో కరస్పాండెంటు కనకమహాలక్ష్మి అబినందించారు. జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. యశ్వంత్ కుమార్‌ను కళాశాల అధ్యాపకులు, తోటి స్నేహితులు అభినందించారు.

బొబ్బిలి: క్రీడాకారులను అభినందిస్తున్న బేబినాయన

బొబ్బిలి: డిసెంబర్ 1వ తేదీ నుండి 3వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో సబ్ జూనియర్, క్యాడిట్ జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 18, 19 తేదీల్లో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. జాతీయ స్థాయికి ఎంపికైన బొబ్బిలి కి చెందిన బి.గౌతమీ(సురేష్ స్కూల్), ఎస్.జాజిలి (ఐరిస్‌స్కూల్), డి.ఆదిత్య, (శ్రీ చేతన్య స్కూల్)లను బొబ్బిలి సీనియర్ తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్, బొబ్బిలి తైక్వాండో క్లబ్ అధ్యక్షులు బేబీనాయన, జిల్లా తైక్వాండో సెక్రటరీ చెలికాని వేణుగోపాల్ రావు అభినందించారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీ పరిధిలో గల గొల్లపల్లి 6వ సచివాలయంలో(11,12 వార్డులలో) ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. ముందుగా సచివాలయ పరిధిలో ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పొందిన సంక్షేమ పథకాలు లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, 12వ వార్డు కౌన్సిలర్ సావు శారద, కో ఆప్షన్ మెంబర్ తెర్లి సత్యారావు, మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ ప్రసాద్, టిపిఆర్‌ఒ జగన్మోహన్, పాల్గొన్నారు.

బొండపల్లి: గడపగడపకూ పేదలకు సంక్షేమం అందించడమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని ఎంపిపి చల్ల చలం నాయుడు అన్నారు. మంగళవారం మరువాడ కొత్తవలస గ్రామ సచివాలయ ఆవరణంలో ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్ అద్యక్షతన ఆంధ్రాకు జగనే ఎందుకు కావలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఇఒపిఆర్‌డి సి.హెచ్.సుగుణాకర రావు గ్రామంలో లబ్ధిదారులకు అందచేసిన సంక్షేమ వివరాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, ఎఒ మల్లికార్జునరావు, హౌసింగ్ ఎఇ బివి.రామరాజు, జెసియస్ మండల కన్వీనర్ పల్లి రఘు, ఎంపిటిసి తాళ్ళపూడి అప్పలనాయుడు, నాయకులు కర్రోతు జనార్ధన్ రావు, సాలాపు పెంటంనాయుడు, వేమలి వెంకటరావు, పాల్గొన్నారు.

వేపాడ: బల్లంకి గ్రామంలో మంగళవారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్లంకి లక్ష్మి, మండల పంచాయతీ విస్తరణ అధికారిని ఉమా, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు జగ్గుబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకట్రావు, బానాది సర్పంచ్ కర్రి యశోద, వార్డ్ మెంబర్ బొడ్డు శ్రీను, బల్లంకి కనకరావు, బీల సతీష్, పంచాయతీ కార్యదర్శి మూర్తి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నారెళ్ల కాలంలో ఇచ్చిన ఎన్నికల హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైసిపి మండల నాయకులు తాడ్డి వేణుగోపాల రావు అన్నారు. మంగళవారం చిన బంటుపల్లిలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాలు బోర్డును ఆవిష్కరించారు.

కొట్టాం రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి - జామి

జామి - కొట్టాం రోడ్డుకు మోక్షం లభించింది. విశాఖ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులతో కొట్టాం వంతెన దెబ్బతిన్న విషయం తెలిసిందే. అయితే దీనిపై జెడ్‌పిటిసి గొర్లె సరయు, జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించగా, విజినిగిరి సర్పంచ్ కిలారీ సూర్యారావు కలెక్టర్‌కు వినతి అందజేశారు. అదే స్థాయిలో పత్రికలు, ప్రతి పక్షాలు కొట్టాం వంతెనతో పాటు ప్రధాన రహదారి చిధ్రమైందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే హైవే గుత్తేదారు ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పనులను వైసిపి మండల అధ్యక్షులు గొర్లే రవికుమార్, సర్పంచ్ సూర్యారావు దగ్గరుండి పరిశీలించారు. హైవే గుత్తేదారు చేపడుతున్న రహదారి నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభంలో మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు అక్కడకు చేరుకుని రహదారి నిర్మాణం నిలుపుదల చేయాలని కోరారు. రోడ్డు వెడల్పు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కోళ్ల హర్షం

జామి - కొట్టాం రోడ్డు నిర్మాణం పట్ల మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే నిర్మాణ పనులను ఆమె పరిశీలించి, పలు మార్లు అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లామని అన్నారు. ఎట్టకేలకు నిర్మాణం జరగడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఉపకార వేతనాలు పంపిణీ

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అదితం లక్ష్మణరావు అండ్ శేషమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఉపకార వేతనాలను అందించింది. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు సమక్షంలో అదితం శివశ్రీ చేతుల మీదుగా ఉపకార వేతనాలను అందజేశారు. ఏటా ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన పేద ఇంజనీరింగ్ విద్యార్థులిద్దరికి ఈ ఉపకార వేతనాలను అందజేస్తొన్నారు. ఈ ఏడాది ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పి.సునీల్, ఎస్.కీర్తిప్రియలకు ఒకొక్కరికి రూ.లక్ష మొత్తాన్ని అందజేశారు. నాలుగేళ్లపాటు వీరికి ఏటా రూ.25వేలు చొప్పున ఈ మొత్తాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్య నిమిత్తం ఆర్థిక సాయం చేయడం ద్వారా వారి కుటుంబాలు బాగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, సిఎస్ఐఆర్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రసాద్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీడయోల్, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ రమణారావులతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాగతోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - గరివిడి

పట్టణంలో ఉన్న అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం మధ్యాహ్నం స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలకడం ద్వారా విద్యార్థుల మధ్య ఆరోగ్యవంతమైన వాతావరణం నెలకొంటుందన్నారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, విద్యార్థి దిశ నిర్దేశాన్ని చూపేది కూడా విద్యార్థి దశ అని తెలిపారు. విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచిస్తూ నూతన అంశాలపై దృష్టి సారించి పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సైంటిస్ట్ కెవివి సంతోషి లక్ష్మి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు అపార ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాలన్న దూరదృష్టితో కాలేజీని 2001లో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అవంతి ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ సెక్రటరీ ప్రియాంక మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు గత 22

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు

సంవత్సరాలు నుండి నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నామన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా గెస్ట్ లెక్చర్స్, వర్క్ షాప్స్ ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ విద్యను అందిస్తున్నామన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అతిథులు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గరివిడి జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాస రావు, గరివిడి మాజీ సర్పంచ్ బమ్మిడి అప్పలస్వామి, ఎంపిటిసి వలిరెడ్డి లక్ష్మణ, వలిరెడ్డి బాబ్జి, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్కివరంలో పంట కోత ప్రయోగం

దెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో నారు వరహాలమ్మ అనే రైతు వరి చేనులో డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం-ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం వరి పంటలో పంట కోత ప్రయోగం చేశారు. ఈ ప్రయోగానికి పర్యవేక్షణ అధికారిగా జిల్లా వ్యవసాయాధికారి వి.టి రామారావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2023 పంట కాలానికి మండలంలో సరిపడ వర్షపాతం నమోదవ్వని కారణంగా పంట దిగుబడులు ఆశించిన రీతిలో లేవన్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రతి రైతు భరోసా కేంద్రంలో గల వ్యవసాయ సహాయకులను క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నష్టం వాటిల్లిన ప్రతి రైతు వివరాలు సేకరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒ పి. నిర్మల, ఎఎస్ఒ కెకె నాయుడు, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' జయప్రదం చేయాలి

బొబ్బిలి: క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్ర పోటీలను జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, పీడీ ఎన్. వెంకటనాయుడు కోరారు. ఆడుదాం-ఆంధ్ర పోటీలపై మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ పోటీలలో వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాట్మెంటన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రికెట్ పోటీలకు 11 నుంచి 16మంది, కోకో పోటీలకు 9నుంచి 15మంది, కబడ్డీకు 7నుంచి 12మంది, వాలీబాల్ పోటీలకు 6 నుంచి 12మంది, షటిల్ పోటీలకు ఇద్దరు చొప్పున పాల్గొనే అవకాశం ఉందన్నారు. 15 ఏళ్లు వయస్సు పైబడిన క్రీడాకారులు డిసెంబర్ 13లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒక క్రీడాకారుడు రెండు పోటీలలో పాల్గొనే అవకాశం ఉందన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై దృష్టి సారించాలి

నెల్లిమర్ల: ఎన్నికల అధికార్లు ఓట్లు చేర్పులు, మార్పులు, సవరణల పై దృష్టి సారించాలని నియోజక వర్గం టిడిపి పోల్ మేనేజ్ మెంట్ కో ఆర్డినేటర్ సువ్వాడ రవి శేఖర్ కోరారు. మంగళవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గం స్థాయిలో నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు ఆధ్వర్యంలో రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశేఖర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో లోపాలు ఉన్నాయని అధికార్లు దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా జాబితాలో మృతి చెందిన వారి ఓట్లు తొలగించబడలేదని, డోర్ నెంబర్ తేడా, వలస పోయిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలు కూడా ఉన్నాయని అధికార్ల దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై ఇఆర్ఒ నూకరాజు మాట్లాడుతూ ఫిర్యాదులు వస్తే పరిశీలించి సవరణలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఆర్ఓ డి. ధర్మరాజు, మూడు మండలాల తహాశీల్దార్లు, టిడిపి జిల్లా అధికారి ప్రతినిధి గేదెల రాజారావు, టిడిపి పార్ల మెంట్ కార్యదర్శి లెంక అప్పల నాయుడు, టిడిపి నాగవంశం కన్వీనర్, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి అవ నాపు సత్య నారాయణ, క్లస్టర్ ఇంఛార్జి అట్టాడ శ్రీధర్ (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిసెంబర్ 2 మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎంపిడిఒ శ్యామల కుమారి మంగళవారం తెలిపారు. మూడవ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. తేదీ మార్పును గమనించాలన్నారు. ఈ సమావేశానికి ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ హాజరవుతారన్నారు.

పోలిపల్లి పశువుల ఆసుపత్రి తనిఖీ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి పశువుల ఆసుపత్రిని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.వి.శ్వేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువులను చికిత్స కోసం తీసుకువచ్చిన రైతులతో వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసు కున్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. పశుసంవర్ధక శాఖ నుండి పొంది రైతులు పొందుతున్న పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, భోగాపురం ఏడి ఉమా శంకర్ మహాపాత్రో, వైద్యాధికారి కమల కుమారి, డిప్యూటీ ఎమ్మార్వో, రైతులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశా జ్యోతి పూలే

బొబ్బిలి: జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలో వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే పని చేశారన్నారు. జనసేన కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జనసైనికులు నివాళులర్పించారు.

వేపాడ: జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండలంలోని ఆకుకొమ్ములు పాలెంలోని ఆయన స్వగృహంలో మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా పేద ప్రజలకు ఉచితంగా పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యను అందించిన మహనీయుడు అని కొనియాడారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని గొల్లవీధి, మహారాణిపేట, వెంకటకృష్ణ థియేటర్, రాజా కళాశాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలన్నారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య విభాగ సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామంలో రాగి పంట, వరి ధాన్యం కొనుగోలుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్ విజయ మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ చిరు ధాన్యాల దినోత్సవం ప్రకటించిన నేపథ్యంలో మండలంలో ఉన్న రైతులు రెండో పంటగా వరి బదులు రాగి పంట వేసుకోవాలన్నారు. రాగి పంటని కూడా ప్రభుత్వం క్వింటాల్ రూ.3846కు కొనుగోలు చేస్తుందన్నారు. ఎ.మధురి శరణ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం రబీకి కావాల్సిన విత్తనాలు మినుము, పెసర 50 శాతం సబ్సిడీతో రాగు విత్తనాలు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

మొక్కుబడిగా కూరగాయల ప్రదర్శన

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటల పరిచయ వేదిక మొక్కుబడిగా సాగింది. ప్రదర్శన ప్రచారంలో తప్ప ప్రజలకు ఉపయోగపడలేదు అధికారులు తీర్మ దిద్దలేకపోయారన్న విమర్శలు వినిపించాయి. పత్రికలు, రైతులకు ఎటువంటి సమాచారం లేకుండా స్థానిక ప్రకృతి వ్యవసాయ అధికారులు, టీమ్ లీడర్ వసంత వ్యవహరిస్తున్న తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా టీమ్ లీడర్ వసంత తన తీరును మార్చుకోవాలని పలువురు చెబుతున్నారు.

పిల్లలుగా మారిన వృద్ధులు

విజయనగరం: వయోవృద్ధులు ఆటపాటలతో చిన్నపిల్లలు మాదిరిగా కేరింతలు కొట్టారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శిల్పారామంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, అందరూ ఆయురారోగ్యాలతో శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించుకున్నారు. ఈ సందర్భంగా ఆటలు, పాటలు పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పింఛనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ప్రతినిధులు సుంకర సూర్యనారాయణ, త్రినాథ్, ప్రసాద్, గిడుతూరి పైడితల్లి, పివి రామారావు, తిరుపతి నాయుడు, బలివాడ వెంకటరమణారావు, బసవమూర్తి పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి రూ.54 వేలు వితరణ

లక్కవరపుకోట: మండలంలోని భీమాలి సమీపంలో ఉన్న చిన్నరావుపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నివాసముంటున్న బూసాల మనీవతి గత కొన్నాళ్లుగా బోన్ మేరో కేన్సర్‌తో బాధపడుతూ విశాఖలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న విశాఖ జిల్లా పద్మనాభం మండలం కొత్త కొవ్వాడలో ఉన్న సంస్కృతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, జామి మండలం అలమండలో ఉన్న (మరో బ్రాంచ్) సంస్కృతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యంతో పాటు సిబ్బంది, విద్యార్థులు కలిసి రూ. 50 వేలు చెక్కును, రూ.4 వేలు నగదును కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. వ్యాధి గ్రస్తురాలికి ఎమ్మెల్సీ, ఎఓటి తరగతి చదువుతున్న ఇద్దరు కుమార్తెలున్నారు. వారి పూర్తి చదువు నిమిత్తం తమ పాఠశాలలో ఉచితమని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య ప్రతినిధులు రుద్రరాజు రామరాజు, వాడపల్లి సాయికృష్ణంరాజు, మాదిరెడ్డి జగదీష్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చిన్నరావుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బూసాల దేవుడమ్మ, ఉపాధ్యాయులు ప్రియాంక, రూపా, నాగేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై ఆరా

దెంకాడ: మండలంలోని గునుపూరుపేట, అమకాం గ్రామాల్లో ఉన్న ఉద్యానవన పంటలపై జాయింట్ కమిషనర్ ఎం. అశోక్ కుమార్ మంగళవారం ఆరా తీశారు. ఉద్యానవన పంటల వల్ల కలుగు ప్రయోజనాలు, ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెదతాడివాడ పంచాయతీలో ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. వారికొచ్చే వేతనాలు, ఇతర ఆదాయ వనరులు కోసం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం క్లస్టర్ ఎపిడి లక్ష్మణరావు, ఎస్‌కోట క్లస్టర్ ఎపిడి శరత్ దేవి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీధర్, ఎపిఒ వెంకట రమణ, ఇసి రమణ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి

వేపాడ: పశుసంవర్ధక శాఖ సహాయకులంతా (ఎహెచ్ఎ) వారి పనితీరును మెరుగుపరుచుకోవాలని ఎస్‌కోట ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు బి చలపతిరావు సూచించారు. మంగళవారం వేపాడ పశు వైద్యశాలలో ఎహెచ్ఎలు, గోపాల మిత్రులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి గ్రేడ్‌లో ఉన్న ఎహెచ్ఎలంతా ఏ గ్రేడ్‌కు రావాలని, పనితీరు మెరుగుపడక పోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఎహెచ్ఎ లతో పాటు గోపాలమిత్రులు కూడా వారికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, కృత్రిమ గర్భోత్పత్తికి సంబంధించిన భారత పశుధన్ యాప్‌లో ఎప్పటికప్పుడు అన్‌లైన్ చేయాలని సూచించారు. పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసి అన్‌లైన్ చేయాలన్నారు.

నిధులు సక్రమంగా వినియోగించాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండల పరిషత్ నిధులు సక్రమంగా వినియోగించాలని ఎంపిపి సంబంగి లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిపి కార్యాలయంలో 2023 - 2024కి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది ప్రతి ఎంపిటిసికి కేటాయించిన నిధులు వినియోగం, రానున్న ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థికసంఘం నిధులు, జనరల్ ఫండ్ నిధుల వినియోగంపై అంచనా బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రవికుమార్, ఎఒ వైస్టు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి మోక్షమెప్పుడో?

బొబ్బిలి: పట్టణంలోని సాయిగణపతి థియేటర్ ఎదురుగా ఉన్న గ్రంథాలయానికి మోక్షం ఎప్పుడని బొబ్బిలి జనసేన పార్టీ మండల అధ్యక్షులు గంగాధర్ సంచాల ప్రశ్నించారు. జనసేన నాయకులు మంగళవారం గ్రంథాలయాన్ని సందర్శించారు. కనీస సౌకర్యాలు లేవని చాలా కాలంగా జనసేన పోరాటం చేస్తున్నా కంటితుడుపు పనులు తప్ప శాశ్వతంగా సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. 2 రోజుల్లో పనులు మొదలు పెట్టకపోతే జనసేన పార్టీ తరఫున బాబు పాలూరు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు రాజా పెద్దిం, యువసుడు సత్యనారాయణ, రాజా జగన్, రేవళ్ల కిరణ్, పోతల శివశంకర్, పాల్గొన్నారు.

దిబ్బగుడివలసలో చోరీ

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడివలసలో చోరీ జరిగింది. దిబ్బగుడివలసకు చెందిన రైతు కె.చిన్నంనాయుడు మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు తీసి ఉండడంతో ఇంటిలోకి వెళ్లి చూసిన రైతు బీరువాలో ఉన్న 6 తులాల బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి లబోదిబోమంటున్నారు. కష్టపడి సంపాదించిన బంగారం నగలు చోరీకి గురికావడంతో బోరున విలపిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

భోగాపురం: మండలంలోని ముంజేరులో మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆశాఖ అధికారులు మంగళవారం మరమ్మతు పనులు చేశారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆ గ్రామ సర్పంచ్ పూడి నూకరాజు ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను లేవనెత్తారు. ఆ ట్రాన్స్ ఫార్మర్ పై వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉండడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఎఇ మస్తాన్‌వలి మరమ్మతులు చేయించారు.

ఘనంగా బంగారమ్మ పండగ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో బంగారమ్మతల్లి పండుగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీగ ఎన్నుపోతును ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కర్రోతు బంగార్రాజు, సత్యన్నారాయణ, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పతివాడు రామకృష్ణ, పైడిరాజు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలి

భోగాపురం: రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలని నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన నాయకులు లోకం మాధవి అన్నారు. మండలంలోని దల్లిపేట పంచాయతీ గాలిపేటలో మన ఊరిలో జనవాణి కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తీరుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మెరుగైన పాలన, సామాజిక న్యాయం కావాలంటే అది జనసేనతోనే సాధ్యమన్నారు. జనసేన సిద్ధాంతాలను మహిళలకు వివరించారు. రానున్న రోజుల్లో గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు.

నియమాలతోనే జబ్బులు దూరం

విజయనగరం కోట: సరైన ఆహార నియమాలు పాటించడం ద్వారా అనేక జబ్బులు రాకుండా బయట పడవచ్చునని ప్రముఖ చిన్నపిల్లలు వైద్య నిపుణులు డాక్టర్ ఎం. వెంకటేశ్వరావు తెలిపారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరోగ్యం బాగుండాలంటే కనీస నియమాలు పాటించాలన్నారు. ముఖ్యంగా రాత్రి ఏడు గంటలలోపు ఆహారం తీసుకోవాలని, 7 గంటల తర్వాత ఎటువంటి కాఫీ, టి, పాలు , జ్యూస్ లాంటివి తాగ కూడదని చెప్పారు. ఉదయం ఇడ్లీ లేదా దోసె లాంటి అల్పాహారం తీసుకుంటూ, ఆకు కూరలు , ఫ్రూట్స్ లాంటివి తినాలని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (APGVB)
విజయనగరం శాఖ, రీజనల్ ఆఫీస్, విజయనగరం

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ తెలుపబడిన మా శాఖ యందు ఖాతాదారుడు బంగారు ఆభరణములు తాకట్టు పెట్టి ఋణము పొందియున్నారు. అట్టి ఋణం మొత్తం సకాలంలో చెల్లించవలసిందిగా నోటీసులు పంపియున్నాము. గడువులోగా ఋణం చెల్లించని కారణంగా తనఖా పెట్టిన బంగారు ఆభరణములను "ఎక్కడ ఎలాగ ఉన్నవి అలాగే" అనే ప్రాతిపదికపై ఈ క్రింది తెలియజేసిన శాఖలో విజయనగరం శాఖకు సంబంధించిన ఆభరణములను విజయనగరం శాఖలో తేది : 14-12-2023 మంగళవారం మధ్యాహ్నం 3గం॥లకు వేలం నిర్వహించబడును.

ఖాతా నెం.	ఋణ గ్రహీత పేరు తండ్రి/భర్త చిరునామా	ఐటమ్	బరువు
73194569040	Narkedimilli Kanakamahalakshmi W/o Veera Venkata Srinivas Siddhi Vinayaka Residency Konisaveedhi, Vizianagaram	Ring - 01	5.77 Grams

వేలం నియమ నిబంధనలు : 01. వేలం APGVB పైన తెలిపినవి విజయనగరం శాఖ యందు జరుపుబడును. 02. వేలంలో పాల్గొనదలచిన వారు రూ॥ 5,000/- సెక్యూరిటీ డిపాజిట్ చేయవలెను. 03. పోటీదారు డబ్బు మొత్తం వెంటనే చెల్లించి ఆభరణములు తీసుకొనవలెను. 04. ఆభరణములు వేలం సమయములో మాత్రమే తనిఖీ చేసుకొనవలెను. 05. సరియైన విలువ రానిచో లేదా ఏ కారణము లేకుండా వేలం రద్దు చేయుటకు బ్రాంచి మేనేజరుకు అధికారం కలదు. మిగతా వివరాలకు బ్రాంచి మేనేజర్ ను సంప్రదించగలరు.

ఇట్లు
శాఖ నిర్వాహణాధికారి, విజయనగరం శాఖ,
విజయనగరం, పిన్-535001, సెల్ : 9440903924